ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

Bullet Edition

సోమవారం, 8 జూలై 2024 www.prajaaswaramdaily.com 4 PM




## అక్రమ నిర్మాణాల కూల్చివేతలు

మేడ్చల్, జూలై 8 (ప్రజాస్వరం): సాలార్జింగ్ కంచెలో భారీ బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాలు కూల్చివేతలు జరుగుతున్నాయి. మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ సాయి ఐశ్వర్య కాలనీ, సాలార్జింగ్ కంచె సర్వే నంబర్ 1,10, లో సోమవారం ఉదయం నుంచి అధికారులు అక్రమ నిర్మాణాలు కూల్చివేతలు జరుపుతున్నారు. మేడిపల్లి మండల తహసీల్దార్ హసీనా వారి సిబ్బంది ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య పలు నిర్మాణాలు కూల్చి వేస్తున్నారు. తమకు అన్ని అనుమతులు ఉన్నా కావాలనే తమ ఇండ్లు కులుస్తున్నారని పలువురు ఆరోపించారు. ఈ సందర్భంగా కూల్చివేతలు అడ్డుకున్న కార్పొరేటర్లు పోచయ్య, హరిశంకర్ రెడ్డి పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై పిర్జాదిగూడ మేయర్ జక్క వెంకటరెడ్డి మాట్లాడుతూ.. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే కూల్చివేతలు జరుగుతున్నాయాని మేయర్ పీఠం కోసం కాంగ్రెస్ నాయకులు బరితెగింపు చర్యలని అన్నారు. తనను అడిగితే వెంటనే రాజీనామా చేస్తానని, పేదవారిని పావులు చేసి వారి జీవితాలతో ఆడుకోవద్దని ఫైర్ అయ్యారు.

## మూడు రోజులు ట్రాఫిక్ ఆంక్షలు


హైదరాబాద్, జూలై 8 (ప్రజాస్వరం): హైదరాబాద్ నగరంలో వాహనదారులకు పోలీసులు కీలక అలర్ట్ జారీ చేశారు. నేటి నుంచి బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఈ క్రమంలోనే ట్రాఫిక్ ఆంక్షలపై, ట్రాఫిక్ అదనపు పోలీస్ కమిషనర్ పి. విశ్వప్రసాద్ తాజాగా ఓ ప్రకటన విడుదల చేశారు. బల్కంపేట లోని ఎల్లమ్మ కల్యాణోత్సవ వేడుకల నేపథ్యంలో సోమవారం నుంచి బుధవారం వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులోకి రానున్నాయని వెల్లడించారు. వాహనదారులు ట్రాఫిక్ ఆంక్షల నేపథ్యంలో ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణం చేయాలని సూచించారు. గ్రీన్‌ల్యాండ్స్, అమీర్‌పేట కనకదుర్గా ఆలయం వైపు నుంచి సత్యం థియేటర్ మీదుగా ఫతేనగర్ వెళ్లే వాహనాలు బల్కంపేట మీదుగా అనుమతి లేదని ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. అయితే, సత్యం థియేటర్ మీదుగా ఎస్సార్‌నగర్ టీ–జంక్షన్ నుంచి ఎస్సార్‌నగర్ కమ్యూనిటీహాల్ కూడలి నుంచి బీకేగూడ, శ్రీరామ్‌నగర్ ఎక్స్ రోడ్డు మీదుగా ఫతేనగర్ వైపు వెళ్లాల్సి ఉంటుంది. మరోవైపు ఫతేనగర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి బల్కంపేట మీదుగా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఈ క్రమంలోనే పోలీసులు సూచించిన ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలి. భక్తుల పార్కింగ్ స్థలాలను సైతం ఏర్పాటు చేశారు. జీహెచ్ఎంసీ గ్రౌండ్స్, ఫతేనగర్ రైల్వే వంతెన కింద, ఆర్అండ్‌బీ కార్యాలయం వైపు పార్కింగ్ స్థలాలను కేటాయించారు. సహాయం కోసం నం. 90102 03626 కు కాల్ చేయవచ్చని ట్రాఫిక్ పోలీసులు సూచించారు.

## తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన



హైదరాబాద్, జూలై 8 (ప్రజాస్వరం): ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఈరోజు నుంచి మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. పశ్చిమ, మధ్య బంగాళాఖాతం, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరం మీదుగా కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఏపీలో పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. రాయలసీమతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. తెలంగాణ విషయానికి వస్తే ఈరోజు హైదరాబాద్, రంగారెడ్డి, భువనగిరి, మల్కాజిగిరి, రాజన్న సిరిసిల్ల, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, వికారాబాద్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కుమురం భీమ్, నిర్మల్, ఆదిలాబాద్, మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఈ రోజు దేశ వ్యాప్తంగా 11 జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ 11 రాష్ట్రాల జాబితాలో ఏపీ, తెలంగాణ, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, బీహార్, ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్ గఢ్, కేరళ, తమిళనాడు, గోవా ఉన్నాయి. ఉత్తరాఖండ్ లో గత నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా కేదార్ నాథ్, బద్రీనాథ్ రహదారులు కూడా మూతపడ్డాయి.

# 35 మందికి లక్కీ ఛాన్స్



## కార్పొరేషన్లకు చైర్మన్ల నియామిస్తూ ప్రభుత్వ జీవో

### రెండేళ్ల పాటు పదవులలో కొనసాగనున్న నేతలు

హైదరాబాద్, జూలై 8 (ప్రజాస్వరం): తెలంగాణ ప్రభుత్వం పెద్ద సంఖ్యలో నామినేటెట్ పదవులను భర్తీ చేసింది. ఏకంగా 35 కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 15నే ఇందుకు సంబంధించి జీవో విడుదలైంది. అయితే, ఎన్నికల కోడ్ దృష్ట్యా నిలిపివేసింది. అన్ని అడ్డంకులు తొలగడంతో ఈ రోజు తిరిగి జీవో విడుదల చేసింది. రెండు రోజుల్లో కార్పొరేషన్ ఛైర్మన్లు బాధ్యతలు స్వీకరించనున్నారు. రెండేళ్ల పాటు పదవుల్లో కొనసాగనున్నారు.

### వివిధ కార్పొరేషన్ల నూతన చైర్మన్లు

| | |
|---|---|
| విత్తనాభివృద్ధి సంస్థ | –అన్వేష్‌రెడ్డి |
| ఆగ్రో పరిశ్రమల అభివృద్ధి | – కాసుల బాలరాజు |
| ఆయిల్ సీడ్స్ అభివృద్ధి సంస్థ | – జంగా రాఘవరెడ్డి |
| రాష్ట్ర సహకార సంఘం | – మానాల మోహన్‌రెడ్డి |
| గిడ్డంగుల సంస్థ | – నాగేశ్వర్‌రావు |
| ముదిరాజ్ కార్పొరేషన్ | – జ్ఞానేశ్వర్ ముదిరాజ్ |
| మత్స్య సహకార సమాఖ్య | – మెట్టు సాయికుమార్ |
| గ్రంథాలయ పరిషత్ | – రియాజ్ |
| అటవీ అభివృద్ధి | – పొదెం వీరయ్య |
| కనీస వేతనాల సలహాబోర్డు | – జనక ప్రసాద్ |
| నీటి పారుదల అభివృద్ధి | – విజయ్‌బాబు |
| స్పోర్ట్స్ అథారిటి | – శివసేనారెడ్డి |
| సెట్ విన్ | – గిరిధర్‌రెడ్డి |
| హస్తకళల అభివృద్ధి | – నాయుడు సత్యనారాయణ |
| ఖనిజాభివృద్ధి | – అనిల్ |
| టీజీఐఐసీ | – నిర్మలా జగ్గారెడ్డి |
| వాణిజ్య ప్రోత్సాహక | – ప్రకాశ్‌రెడ్డి |
| సాంకేతిక సేవల అభివృద్ధి సంస్థ | – మన్నె సతీశ్‌కుమార్ |
| పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ | – చల్లా నరసింహారెడ్డి |
| శాతవాహన పట్టణాభివృద్ధి సంస్థ | – కె.నరేందర్‌రెడ్డి |
| కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ | – ఈ.వెకంటరామిరెడ్డి |
| రహదారి అభివృద్ధి సంస్థ | – మల్‌రెడ్డి రామిరెడ్డి |
| పర్యాటక అభివృద్ధి సంస్థ | – పటేల్ రమేశ్‌రెడ్డి |
| తెలంగాణ ఫుడ్స్ | – ఎం.ఎ.ఫహీమ్ |
| ఆర్యవైశ్య కార్పొరేషన్ | – కాల్వ సుజాత |
| బీసీ కార్పొరేషన్ | – నూతి శ్రీకాంత్ |
| ఎస్సీ కార్పొరేషన్ | – ఎన్.ప్రీతం |
| ఎస్టీ కార్పొరేషన్ | – బెల్లయ్య నాయక్ |
| గిరిజన కార్పొరేషన్ | – కె.తిరుపతి |
| ఎంబీసీ కార్పొరేషన్ | – జైపాల్ |
| మహిళా సహకార అభివృద్ధి సంస్థ | – శోభారాణి |
| వికలాంగుల కార్పొరేషన్ | – ఎం.వీరయ్య |
| సంగీత నాట్య అకాడమీ | – అలేఖ్య పుంజాల |
| మైనార్టీ కార్పొరేషన్ వైస్‌ఛైర్మన్ | – ఎం.ఎ.జబ్బార్ |

## విద్యార్థిని ఆత్మహత్యాయత్నం



సంగారెడ్డి, జూలై 8 (ప్రజాస్వరం): రాయికోడ్ (మం) అల్లాపూర్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్‌లో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసింది. పదో తరగతి విద్యార్థిని మల్లేశ్వరి స్కూల్ బిల్డింగ్ పై నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. విద్యార్థిని మల్లేశ్వరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఆమెను జహీరాబాద్ ఆస్పత్రికి తరలించారు. మల్లేశ్వరి స్వస్థలం రాయికోడ్ (మం) ఇసుపూర్ గ్రామం.

## తిరుమలలో 208 దళారుల అరెస్ట్

### 381 మంది కోసం గాలింపు

తిరుపతి, జూలై 8 (ప్రజాస్వరం): తిరుమలలో దళారుల ఆటకట్టించేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. టీటీడీ విభాగం నుంచి గదులు పొంది అక్రమాలకు పాల్పడిన వారిపై నిఘా పెంచారు. దళారుల అక్రమాలపై 2019 నుంచి ఇప్పటివరకూ 279 కేసులు నమోదు అయ్యాయి. ఈ కేసుల్లోని నిందుతుల వివరాలను ప్రకటించారు. నకిలీ ఆధార్‌లతో గదులు, సేవా టికెట్లు పొందిన 589 మందిని గుర్తించారు. వీరిలో 208 మందిని అరెస్ట్ చేశారు. మిగిలిన 381 మంది కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నిందితులు సమర్పించిన నకిలీ ఆధార్ కార్డుల ఆధారంగా పట్టుకునేందుకు యత్నిస్తున్నారు. కాగా రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో తిరుమల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమలలో జరిగిన అవినీతి, అక్రమాలపై నిఘా పెట్టారు. చిన్న తప్పు దొరికినా వెంటనే చర్యలు తీసుకుంటున్నారు. గత ప్రభుత్వంలో చాలా అక్రమాలు, అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. దీంతో వారందరిపై చర్యలు తీసుకునేందుకు చంద్రబాబు ప్రభుత్వం సిద్ధమైనట్లు తెలుస్తోంది.

## విశ్వాస పరీక్ష నెగ్గిన హేమంత్ సోరెన్



న్యూఢిల్లీ, జూలై 8 (ప్రజాస్వరం): జార్ఖండ్ అసెంబ్లీలో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ విశ్వాస పరీక్ష నెగ్గారు. హేమంత్ సోరెన్ కు 45 మంది ఎమ్మెల్యేలు మద్దతు తెలిపారు. జార్ఖండ్ స్పీకర్ రవీంద్ర నాథ్ మహతో విశ్వాస తీర్మానంపై చర్చకు గంట సమయం కేటాయించారు. జార్ఖండ్ అసెంబ్లీలో 81 మంది సభ్యులు ఉన్నారు. కాగా, అసెంబ్లీ ఎన్నికల్లో కొందరు విజయం సాధించడంతో సభ్యుల సంఖ్య 76కి తగ్గింది. విశ్వాస పరీక్ష నెగ్గాలంటే 38 మంది సభ్యుల మద్దతు అవసరం. కాగా.. హేమంత్ సోరెన్ నేతృత్వంలోని జార్ఖండ్ ముక్తి మోర్చాకు కాంగ్రెస్, ఆర్జేడీ మద్దతు ఉంది. బలపరీక్షలో హేమంత్ కు జేఎంఎంకు చెందిన 27 మంది, కాంగ్రెస్ కు చెందిన 17 మంది, ఆర్జేడీకి చెందిన ఒక ఎమ్మెల్యే మద్దతు తెలిపారు. బీజేపీ నేతృత్వంలోని ప్రతిపక్షానికి 30 మంది సభ్యులున్నారు.

కాగా, హేమంత్ సోరెన్ తన మంత్రివర్గాన్ని విస్తరించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. జూలై 4న జార్ఖండ్ ముఖ్యమంత్రిగా మూడోసారి హేమంత్ సోరెన్ ప్రమాణ స్వీకారం చేశారు. జనవరి 31న భూకుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈడీ అధికారులు హేమంత్‌ను అరెస్ట్ చేశారు. ఆ తర్వాత జైలుకు తరలించారు. ఆయన వారసుడిగా ఫిబ్రవరి 2న చంపై సోరెన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే ఇటీవలే హేమంత్‌కు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. అయిదు నెలల తర్వాత జూన్ 28న బిర్సా ముండా జైలు నుంచి ఆయన విడుదలయ్యాక.. జూలై 4న సీఎంగా బాధ్యతలు చేపట్టారు.



## పూరీ బీచ్‌లో రాష్ట్రపతి మార్నింగ్ వాక్

### 'ఎక్స్' లో ఫొటోలు షేర్ చేసిన రాష్ట్రపతి భవన్ కార్యాలయం

### గ్లోబల్ వార్మింగ్, కాలుష్యం పెరిగిపోవడంపై ద్రౌపదీ ముర్ము ఆందోళన

### ప్రజలంతా ప్రకృతి పరిరక్షణకు ప్రతినబూనాలని పిలుపు

హైదరాబాద్, జూలై 8 (ప్రజాస్వరం): ఒడిశాలోని పూరీలో ఆదివారం జగన్నాథ రథయాత్ర ప్రారంభోత్సవంలో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం ఉదయం పూరీ బీచ్ లో మార్నింగ్ వాక్ తో తన దినచర్యను మొదలుపెట్టారు. సాధారణంగా ఎప్పుడూ చీరకట్టులో కనిపించే ద్రౌపదీ ముర్ము.. వాకింగ్ కు వీలుగా ఉండేలా పంజాబీ డ్రెస్ ధరించారు. అలాగే వాకింగ్ షూస్ ధరించి బీచ్ లో కలియదిరిగారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను రాష్ట్రపతి భవన్ కార్యాలయం రాష్ట్రపతి 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసింది.భావోద్వేగపూరితమైన పోస్ట్‌ఈ సందర్భంగా రాష్ట్రపతి ముర్ము భావోద్వేగపూరితమైన పోస్ట్ ను నెటిజన్లతో పంచుకున్నారు. 'మానవాళి జీవిత సారాంశాన్ని తెలియజెప్పడంతోపాటు మనం ప్రకృతిలో భాగమని గుర్తుచేసే కొన్ని ప్రదేశాలు ఉన్నాయి. పర్వతాలు, అడవులు, నదులు, సముద్రతీరాలు మనకు అంతర్లీనంగా ఏదో చెబుతుంటాయి. ఈ రోజు తీరం వెంబడి నడిచినప్పుడు అక్కడి పరిసరాల్లో వీస్తున్న పిల్ల గాలులు, అలల హోరు, అనంత సముద్ర జలాలతో కలిసి ఒకే రకమైన అనుభూతిని చెందాను. ఇదో ధ్యాన అనుభూతి. ఇది నాలో అంతర్లీనంగా గాఢమైన శాంతిని కలిగించింది. నిన్న పూరీ జగన్నాథుని దర్శనం చేసుకున్నప్పుడు సైతం నాకు ఇదే అనుభూతి కలిగింది. ఇలాంటి అనుభూతిని నేనేమీ ఒంటరిగా పొందలేదు. మన జీవితాలను అర్థవంతంగా మార్చే, మనల్ని నిలబెట్టే మనకన్నా ఎన్నో రెట్లు పెద్దదైనది ఎదురైనప్పుడు మనమంతా ఇదే అనుభూతి చెందుతాం' అని రాష్ట్రపతి తన పోస్ట్ లో రాసుకొచ్చారు.'రోజువారీ ఉరుకుల పరుగుల జీవితంలో మనం ప్రకృతితో ఉన్న అనుబంధాన్ని కోల్పోతున్నాం. ప్రకృతిని జయించామని భావిస్తూ స్వల్పకాలిక ప్రయోజనాల కోసం ప్రకృతిని నాశనం చేస్తున్నాం. దాని ఫలితాన్ని మనమంతా ఇప్పుడు అనుభవిస్తున్నాం. ఈ ఏడాది వేసవిలో దేశమంతా వడగాడ్పులతో అల్లాడింది. కొన్నేళ్లుగా ప్రపంచవ్యాప్తంగా భారీ వాతావరణ మార్పులు సాధారణం అయిపోయాయి. వచ్చే కొన్ని దశాబ్దాల్లో పరిస్థితి మరింత దారుణంగా మారబోతోంది' అంటూ ముర్ము ఆందోళన వ్యక్తం చేశారు.'భూమిపై 70 శాతానికిపైగా మహాసముద్రమే విస్తరించింది. గ్లోబల్ వార్మింగ్ వల్ల నిరంతరం సముద్రమట్టాలు పెరుగుతున్నాయి. ఇది తీరప్రాంతాలకు ముప్పుగా మారుతోంది. మరోవైపు వివిధ రకాల కాలుష్యాల కారణంగా సముద్రాలు, అందులోని మొక్కలు, జీవజాలం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రకృతి ఒడిలో నివసించే వారు అనుసరించే సంప్రదాయాలు మన ఈ సమస్యల పరిష్కారానికి దారిచూపుతాయి. ప్రభుత్వ స్థాయిలో పెద్ద ఎత్తున పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపట్టడంతోపాటు ప్రజలంతా ప్రకృతి పరిరక్షణకు చిన్నచిన్న అడుగులు వేస్తే మనం ఈ సమస్యల నుంచి బయటపడతాం. భద్రమైన భవిత కోసం మనమంతా వ్యక్తులుగా ఏం చేయగలమో చేద్దామని ప్రతిజ్ఞ చేద్దాం. భావి తరాల కోసం మనం ఈ పని చేయాలి' అని ముర్ము మరో పోస్ట్ లో కోరారు.

